క్లుప్తంగా

పరామర్శ



బేల్దారి నాగేంద్రను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని క్రిష్ణాపురం జీరో రోడ్డులో ఈనెల 7న అల్లరి మూలకచేతిలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న బేల్దారి నాగేంద్రను శుక్రవారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్కులను పరిశుభ్రంగా ఉంచుకుందాం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్న మున్సిపల్ పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఉదయం 33వ వార్డులోని ప్రార్థనా మందిరం ఎదురుగా ఉన్న పార్క్‌లో ఇంజినీరింగ్ సిబ్బంది చేత జంగిల్ క్లియరెన్స్ పనులను చేయించారు. మొక్కలను నీరు పోశారు. కమిషనర్‌తో పాటు ఏఈ హరిక్రిష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పరిశీలించారు.

నెట్టికంటుడి సేవలో బళ్లారి మాజీ ఎమ్మెల్యే



గాలి సోమశేఖరరెడ్డికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బళ్లారి మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఏటా హనుమద్ వ్రతం రోజున ఆయన స్వామిని దర్శనం చేసుకుంటారు. ఈక్రమంలో శుక్రవారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

'ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి'

గుత్తి: గుత్తి మున్సిపాలిటి పరిధిలోని తాడిపత్రి రోడ్డులో మున్సిపల్ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు తాడిపత్రి రోడ్డు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తాడిపత్రి రోడ్డు వెంకటరమణ, సురేంద్ర, శంకర్ రెడ్డి, హరి, రాఘవేంద్ర, తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ పార్కు స్థలంలో కంచె ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. అయితే మున్సిపల్ అధికారులు కేవలం బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఆ బోర్డులను కూడా ఆక్రమణదారులు తొలగించారన్నారు. ప్లాట్లుగా వేసి స్థలాన్ని విక్రయిస్తున్నారన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు కంచె ఏర్పాటు ఏయాలని డిమాండు చేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హనుమద్ వ్రతం ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లతో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులకు శుక్రవారం డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ భారీ ఎత్తున భక్తులు, మాలధారులు పాల్గొన్న హనుమద్ వ్రతం ఉత్సవాల్లో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చే విషయంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఎంతగానో కృషి చేశారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు కార్యక్రమంలో సైతం పాల్గొన్నారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై రైతు కన్నెర్ర

అన్నదాతలకు అండగా జిల్లా కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసన ర్యాలీకి తాడిపత్రి, గుంతకల్లు, శింగనమలకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు భారీగా తరలివెళ్లారు. ముందుగా ఆయా మండల కేంద్రాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వివిధ వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు అనంతపురం తరలివెళ్లారు.

- అన్నదాతకు అండగా కదిలిన వైఎస్సార్‌సీపీ అభిమానులు
- నిరసన ర్యాలీకి భారీగా తరలివెళ్లిన అన్నివర్గాల శ్రేణులు



పామిడి నుంచి అనంతపురానికి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్నదాతలు



బుక్కరాయసముద్రం నుంచి బైక్ ర్యాలీగా అనంతపురం పోరుబాటకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు



పోరుబాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో తాడిపత్రి పట్టణ నాయకులు



పోరుబాటకు హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్/గుంతకల్లుటౌన్/పామిడి/యాడికి/శింగనమల: జిల్లా కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన రైతుపోరుబాట కార్యక్రమానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొణిదల రమేష్‌రెడ్డి, మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత, ముస్లిం మైనార్టీ నాయకుడు జావీద్‌ఖాద్రీ, సజ్జలదిన్నె రాజు, గంగులకుంట కేశవరెడ్డి, కాశిమనోజ్, పేరం ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి వారి వెంట పెద్దెత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సూచన మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గాదిలింగేశ్వరబాబు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా వాహనాల్లో అనంతపురానికి వెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు. అదేవిధంగా పామిడి నుంచి వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు అనంతపురం తరలివెళ్లారు. యాడికి నుంచి దాదాపు 200 మంది నాయకులు కార్యకర్తలు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకుడు భోగాతి బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకట నాయుడు,నాగరాజు, రామ్మోహన్ , నిట్టూరు రామాంజుల రెడ్డి. జయకృష్ణ, నాగేష్, లక్షుంపల్లి, తూట్రాళ్ల పల్లి, నగరూరు సర్పంచులు పద్మనాభరెడ్డి, సంజీవరాయుడు, రుక్మాంధరరెడ్డి, శివప్రసాద్, అశోక్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రమానంద రెడ్డి, అమర్‌నాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బీకేఎస్ నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు అనంతపురానికి భారీగా తరలి వెళ్లారు. జెడ్పీటీసీ నీలం భాస్కర్ , పార్టీ మండల కన్వీనర్ అంకే నరేష్, సర్పంచ్ పార్వతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యల్లనూరు మండలం నుంచి పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



పోరుబాటలో పాల్గొన్న యాడికి జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి



పోరుబాటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ భవాని, వీసీ నైరుతిరెడ్డి తదితరులు



పామిడిలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెన్నాలో డ్రైనేజీ నీటిని అరికట్టండి



బోరులో వస్తున్న నురగతో కూడిన నీటిని చూపిస్తున్న నాయకులు

తాడిపత్రి రూరల్: పెన్నానదిలో కలుస్తున్న డ్రైనేజీ నీటిని అరికట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. పెన్నానదిలో కలుస్తున్న మురికి నీటిని శుక్రవారం వారు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ డ్రైనేజీ నీరంతా పెన్నానదిలోకి కలుస్తుండటంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. పెన్నానదిలో వేసిన బోర్ల నుంచి నురుగతో కూడిన డ్రైనేజీ నీరు వస్తుందనంటే ఏ స్థాయిలో మురికి నీరు కలుస్తుందో అర్థమవుతోందన్నారు. మునిసిపల్ అధికారులకు పన్నుల వసుళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా ఆరోగ్యంపై లేదన్నారు. వెంటనే మురికి నీటిని నిలుపుదల చేయకుంటే ఆందోళన చేయడంతో పాటు మునిసిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీరాములు, సూరి, ఉమాగౌడ్, రమణ, రవికుమార్, నాగేంద్ర, రామంజినేయులు అబ్రహం, దాసు తదితరులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ రూ.2300గా ధర నిర్ణయించిందన్నారు. అలాగే లోడింగ్, కూలీలు, రవాణా చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకుని ఉంటే వ్యవసాయ అధికారులే వచ్చి ధాన్యం తీసుకెళ్తారన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే 48 గంటల్లో ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ ఈరమ్మ, సివిల్ సప్లై ఆఫీసర్ రమేష్ రెడ్డి, కార్పొరేట్ డిపార్మెంట్ ఆఫీసర్ అరుణకుమారి, ఏఓ సోమశేఖర్, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రత వేడుకలు



వేమనాశ్రమంలో అభయాంజనేయస్వామి



సాల గ్రామ వైద్య ఆంజనేయస్వామి

తాడిపత్రి: హనుమద్ వ్రత వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి, పుట్లూరు రోడ్డులోని అభయాంజనేయస్వామి, జింకావారి వీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి, విజయనగర్‌కాలనీ, గాజుల క్రిష్టప్ప, చింతల వెంకటరమణస్వామి ఆలయాల్లోని ఆంజనేయస్వామి, పెన్నా వంతెన సమీపంలోని సాలగ్రామ వైద్య ఆంజనేయస్వామి, కడప రోడ్డులోని వేమనాశ్రమంలో నిర్వాహకులు హనుమద్ వ్రత వేడుకలు ఆచరించారు. స్థానిక వేమనాశ్రమంలోని ఆంజనేయ స్వామికి అభిషేకం, వడమాలసేవ, ఆకుపూజ సేవలను నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులకు హనుమాన్ ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

గార్లదిన్నె: విశాఖపట్నం జీవీఎంసీ కార్పొరేటర్ గోవిందరెడ్డి కౌన్సిల్ సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల సచివాలయ ఉద్యోగులు శుక్రవారం గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ కార్పొరేటర్ వెంటనే సచివాలయ ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలన్నారు. సర్వీస్ నిబంధనలు, ప్రమోషన్ ,పీఆర్సీ ప్రయోజనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠినచర్యలు



గుత్తి ఆర్‌ఎస్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లిలో మాట్లాడుతున్న పోలీసులు

గుత్తి/పెద్దవడుగూరు: గొడవలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని పలు కాలనీల్లో శుక్రవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానితులు, పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. అల్లర్లకు, గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగమానిక్యం, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని మేడిమాకులపల్లిలో ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బంది తో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

సాక్షి జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

గార్లదిన్నె: వైఎస్సార్ జిల్లా జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవి రిపోర్టర్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని గార్లదిన్నె వర్కింగ్ జర్నలిస్టు సంఘం నాయకులు గోవిం దరెడ్డి, సాక్షి రిపోర్టర్ ఆదినారాయణ, ప్రజాశక్తి రిపోర్టర్ ఆదినారాయణ, సూర్య రిపోర్టర్ క్రిష్ణ, వార్త రిపోర్టర్ ఓబిలేసు అన్నారు. వారు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులపై దాడులు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టులపై దాడులు జరుగ కుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు లంతా ఉద్యమాలు చేస్తామన్నారు.

శోకసంద్రంలో యర్రగుంట్ల



పోస్టుమార్టం అనంతరం సుజాత, నాగచైతన్య మృతదేహాలు అప్పగించిన దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లకు చెందిన సుజాత, ఆమె కుమారుడు నాగచైతన్య విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకోగా.. మృతదేహాలు శుక్రవారం గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు, బంధువులు నివాళులర్పించారు. తల్లి, కుమారుడు విగత జీవులుగా పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యులు భోరున విలపించారు. అనంతరం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

నిందితుడి అరెస్ట్

గార్లదిన్నె: యర్రగుంట్లకు చెందిన సురేష్ వేధించడం వల్లే విషపు గుళికలు మింగి తల్లి, కుమారుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు సుజాత సోదరుడు ఫిర్యాదు మేరకు.. గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో భర్త సురేష్‌పై వేధింపులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. సురేష్‌ను శుక్రవారం మర్తాడు క్రాస్ సమీపంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే కల్లూరులో మూడు రోజుల క్రితం ఓ మైనర్ బాలికపై ముంటిమడుగు గ్రామానికి చెందిన వంశీ అనే వ్యాన్ డ్రైవర్ అత్యాచారం, రేప్ చేసినట్లు కేసు నమోదు కావడంతో.. శుక్రవారం కల్లూరులో వంశీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సహకరించాలి

శింగనమల / యాడికి / గుత్తిరూరల్ / గార్లదిన్నె / పెద్దవడుగూరు / యల్లనూరు: సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అధికారులు సూచించారు. ఈ మేరకు ఆయా మండల కేంద్రాల్లో తహసీల్దార్లు సమావేశం నిర్వహించి, శనివారం నిర్వహించే ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శింగనమలలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఏఓ అన్వేష్ కుమార్, తదితర మండల అధికారులు, ఇరిగేషన్, హెచ్చెల్సీ అధికారులు పాల్గొన్నారు. యాడికిలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, నీటిపారుదల శాఖ జేఈ సలీంబాషా, ఏఓ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ వీరరాజు, డీటీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అలాగే గుత్తిలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ ఓబిలేసు, ఎంపీడీఓ శివాజీరెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ విజయకుమార్, మునిసిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, పీఆర్ ఏఈ మల్లేష్‌నాయక్, ఎంఈఓ రవినాయక్, ఏఓ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు. గార్లదిన్నెలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ ఈరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దవడుగూరులో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. యల్లనూరులో తహసీల్దారు రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ యోగేశ్వరి కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించాలన్నారు. ఆకులేడు ఎంపీటీసీ మొరార్జీ మాట్లాడుతూ ప్రభుత్వం మారగానే ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు అధికారులు గుర్తింపు ఇవ్వడం లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ఖచ్చితంగా పాటించాలని, దీనిపై అధికారులందరికీ తెలియజేస్తామన్నారు. జూలకాల్వ సర్పంచ్ రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పంటలకు బీమా ప్రీమియం ఏవిధంగా చెల్లించాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తరిమెల సర్పంచ్ ఓబిలేసు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యలున్నాయని, సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదన్నారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీలు నరసింహులు, విజయ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

పశు కృత్రిమ గర్భధారణపై వైద్య శిబిరం



మాట్లాడుతున్న డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ టీవీ సుధాకర్

పామిడి: మండలంలోని అప్పాజీపేటలో పశువైద్యశాలలో కృత్రిమ గర్భాధారణపై ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డా.సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయనే స్వయంగా రైతులు తీసుకువచ్చిన ఆవులకు కేవలం పెయ్యదూడలను ఇచ్చేలా కృత్రిమ గర్భాధారణ చికిత్స అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ రైతులతో మాట్లాడారు. పాడి రైతులు ఎక్కువగా పెయ్య దూడల వైపు మొగ్గు చూపిస్తున్నారన్నారు. నూతన ప్రయోగాల ద్వారా కృత్రిమ గర్భాధారణ ద్వారా పెయ్యలు మాత్రమే జన్మించే వీర్యం ఇప్పుడు అందుబాటులో ఉందన్నారు. దీని ధర రూ.1350 కాగా, ప్రభుత్వం 63 శాతం రూ.850 సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతు కేవలం రూ.500 కడితే సరిపోతుందన్నారు. ఒకవేళ ఇవి ఫెయిల్ అయితే ఆ నగదు తిరిగి రైతుకు చెల్లిస్తామన్నారు. పొరపాటున కుర్ర దూడ పుడితే రూ.250 తిరిగి చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఎద్దులపల్లి వైద్యాధికారి బీ సాయిసుప్రజ, ఏహెచ్‌ఏలు హరికృష్ణ, వనజ, వన్నూరువలి, సాధిక, నాగరాజు, అంజలీదేవి, గోపాలమిత్రాలు అశ్వర్థనారాయణ, నరేంద్ర, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

దత్తపీఠంలో ఘనంగా హోమాలు



మహాయోగ దత్తపీఠంలో లక్ష్మీహోమం దృశ్యం

పామిడి: పట్టణంలోని మహాయోగ దత్తపీఠంలో శుక్రవారం పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో హోమాలు ఘనంగా నిర్వహించారు. శ్రీసుక్త విధానేనా లక్ష్మీహోమం, గణపతి హోమం, దత్తాత్రేయ మూలమంత్ర హోమం చేశారు. తొలుత దత్తపాదుక, శివ, దత్తాత్రేయ పంచామృత అభిషేకం , అరుణ మంత్ర కలశ పూజలు జరిగించారు. చతుర్వేద మంత్ర పుష్పహారతులు గావించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి అర్బన్: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు, కడప రోడ్డు, యల్లనూరు రోడ్డు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

యువతి అదృశ్యం

యాడికి: యువతి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని రామాంజనేయులు కుమార్తె గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని శుక్రవారం రామాంజనేయులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.